క్లుప్తంగా

రక్తదానంతో ఇబ్బందులు ఉండవు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రక్తదానం చేయడం వల్ల ఇబ్బందులు ఉండవని భీమవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.వీరాస్వామి అన్నారు. శనివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ ఈ శిబిరంలో విద్యార్థులు 50 యూనిట్ల రక్తాన్ని అందించారని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్యుడు సాయి కిరణ్మయి, ల్యాబ్ టెక్నిషియన్ సందీప్, ఏసుబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మం, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాతాజీ మృతికి సంతాపం



కోయ తాతాజీ

భీమవరం(ప్రకాశంచౌక్): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీ ఉమా సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు కోయ తాతాజీ స్థానిక హాస్పిటల్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే శ్రీనివాస్, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లం రాంబాబు, మద్దుల కరుణ, ఈల్ల రాధా తుంద్రురు సర్పంచ్ ఆరేటి వీరస్వామి నాయుడు, కోయ దొరబాబు, ముత్యాలరావు, నల్లం రామకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పీవీకు భారతరత్నపై హర్షం



పీవీ నరసింహరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నరసాపురం రూరల్: భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న పురస్కారాన్ని ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం నరసాపురం మండలం వేములదీవి గొందిమూల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు రాజశ్రీ పీవీ నరసింహరావు జీవిత చరిత్రను, విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

గజమాల యాత్రను జయప్రదం చేయాలి

మొగల్తూరు: అంతర్వేది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏటా సమర్పిస్తున్న భారీ గజమాల యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ముత్యాలపల్లిలో మత్స్యకార నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మకు, లక్ష్మీ నరసింహ స్వామికి భారీ గజమాలను సమర్పిస్తామన్నారు. భారీ గజమాల యాత్ర ఈ నెల 19న కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం చోరంపూడిలో ప్రారంభమై బంటుమిల్లి, లక్ష్మీపురం మీదుగా ముత్యాలపల్లి, మొగల్తూరు, నరసాపురం, చించినాడ మీదుగా అంతర్వేదికి చేరుకుంటుందన్నారు.

ప్రజాసమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఉండి: ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు చేయకముందే వాటిని పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ ఎస్.రవీంద్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులెవ్వరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన ప్రతి సంక్షేమ పథకం నూటికి నూరుశాతం అర్హులైన లబ్ధిదారులకు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. దానిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దఫా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని అన్నారు. వైద్యాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ఆయా గ్రామాల్లో ప్రజలంతా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ ఆరోగ్య పథకంపై మరింతగా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పరిమితిని పెంచారని ప్రజలకు తెలియజేయాలని కోరారు. అలాగే ఇరిగేషన్ శాఖాధికారులు వంతులవారీ విధానంలో అందిస్తున్న సాగునీటిని ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాకుండా శివారు ప్రాంతాలకు కూడా చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి వారు ఫిర్యాదులు చేయకముందే సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో డ్రెయిన్స్ శాఖ డ్రెయిన్స్‌లోని ఆటంకాలను పూర్తిగా తొలగించాలన్నారు. అలాగే ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన పనులను వేగంగా నిర్మాణం చేయాలని సూచించారు. అలాగే పంచాయితీరాజ్ అధికారులు జల్ జీవన్ మిషన్ లేదా రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా మంజూరైన నిధులతో త్వరితంగా పనులు పూర్తి చేయాలన్నారు. పైపులైన్ల విస్తరణ, ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం, ఫిల్టర్‌బెడ్‌లు, మైక్రో ఫిల్టర్ల నిర్మాణం వంటి పనులు వేసవికి ముందుగానే పూర్తి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ మహంకాళి, వైస్ ఎంపీపీ గుత్తుల కనకమహాలక్ష్మీ, ఎంపీడీఓ ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మోటారు సైకిలిస్టుకు గాయాలు

ఆకివీడు: మండలంలోని తాళ్లకోడు గ్రామానికి చెందిన చింతా పేతురు శనివారం మధ్యాహం మోటారు సైకిల్‌పై మందపాడు వెళ్లుతుండగా అయిభీమవరంలోని మదనగోపాలస్వామి ఆలయం వద్ద సమోసాలతో ఆగి ఉన్న సైకిల్‌ను ఢీకొట్టాడు. మద్యం మత్తులో వాహనాన్ని అతివేగంగా నడుపుతూ సైకిల్‌ను ఢీకొట్టడంతో పర్లాంగు దూరం సిమెంట్ రోడ్డుపై దొర్లుకెళ్లాడు. దీంతో అతని తలపై, ముఖంపై, ఇతర చోట గాయాలయ్యాయి. సంఘటనా స్థలం సమీపంలో ఉన్న గ్రామ సర్పంచ్ గాలి సామ్రాజ్యం వెంటనే స్పందించి 108కు ఫోన్ చేయడంతో హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి తమకు సమాచారం వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని, బాధితుడు తరపు నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై నాగబాబు చెప్పారు.

ముగిసిన మల్టీమీడియా గ్రాఫిక్స్ వర్క్‌షాప్

భీమవరం: మల్టీమీడియా, గ్రాఫిక్స్‌లో శిక్షణ పొందితే ఇంజినీరింగ్ ప్రాజెక్టులు చేసేందుకు ఉపయుక్తమని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. కళాశాలలో సాఫ్ట్‌వేర్ నిపుణులతో ఏర్పడిన స్వేచ్ఛ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్ షాప్ శనివారం ముగిచింది. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మల్టీమీడియా, గ్రాఫిక్స్‌లో శిక్షణ కంప్యూటర్స్‌కు మాత్రమే కాకుండా ఇతర ఇంజినీరింగ్ గ్రూపులకు కూడా ఉపయోగమన్నారు. టెక్నాలజీ సెంటర్ హెడ్ నూకల గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ స్వేచ్ఛ లెర్నింగ్ సెంటర్ నిపుణులు రెండేళ్ల క్రితం కళాశాలతో ఎంవోయూ చేసుకుని అప్పటి నుంచి విద్యార్థులకు ఉపయోగకరమైన ఎన్నో నూతన టెక్నాలజీలను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్‌డీ విభాగం హెడ్ ఎం సురేష్‌బాబు, వర్క్‌షాప్ రిసోర్సుస్ పర్సన్ నాగమల్లి, మణికంఠ పాల్గొన్నారు.



శిక్షణ పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

నేడు జనరిక్ మెడికల్ షాపు, ఏటీఎం ప్రారంభం

ఉండి: మండలంలోని యండగండి గ్రామంలో ఆదివారం ఉదయం 8:30 గంటలకు ది యండగండి విశాల సహకారం సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జనరిక్ మెడికల్ షాపు, డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఏటీఎంను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా ప్రారంభిస్తారని సహకార బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులతో పాటు ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్లు వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్‌వీఎన్ పురం (ఎఫ్ఎల్ సొసైటీ), సీపీడీ కంపెనీ, పల్లిపాలెం, ఈలంపూడి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలపై 16న నిరసన

భీమవరం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16న మండల, పట్టణ కేంద్రాల్లో చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జుత్తిగ నర్సింహమూర్తి అధ్యక్షతన ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ మాట్లాడారు. బీజేపీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడంలో విఫలమైందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. సమావేశంలో వివిధ కార్మిక రైతు సంఘాల నాయకులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, మల్లిపూడి ఆంజనేయులు, చెల్లబోయిన రంగారావు, కె.లక్ష్మణరావు, దండు శ్రీనివాస్‌రాజు, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హరేరామ్

నెరవేరిన సొంతింటి కల

ఆకివీడు: పేదోడి సొంత ఇంటి కలన సీఎం జగన్ నెరవేరుస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో లబ్ధిదారుడు జంగం బెల్‌సాగర్ నూతనంగా నిర్మించిన గృహాన్ని శనివారం ఆయన ప్రారంభించి, గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదోడికి సెంటు భూమిని గత ప్రభుత్వాలు ఇవ్వలేదన్నారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో 74 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇచ్చేందుకు సిద్ధం చేసినప్పటికీ గత పాలకులు పేదలకు పంచలేదని ఆరోపించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పేదోడికి భూమి, పట్టా ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి రూ. 1.80 లక్షలు అందజేస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులు స్వంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నారని చెప్పారు. కాలనీలో మిగిలిన లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జామి హైమావతి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, శిరపు శ్రీను, హుస్సేన్, బంటుమిల్లి సురేష్, కటికతల సువర్ణరాజు, పాగొల్లు రాజు, ఎరిచర్ల గ్లాడ్‌సన్, గేదల అప్పారావు పాల్గొన్నారు.



గృహ ప్రవేశ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

'విద్యారణ్య మహర్షి'పై గరికిపాటి ప్రవచనం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం స్థానిక ఆనంద ఫంక్షన్ హాలులో ప్రవచన చక్రవర్తి, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు 'విద్యారణ్య మహర్షి విరచితం'పై చేసిన ప్రవచనం అందరినీ అలరించింది. తొలుత గరికిపాటి నరసింహారావు, మాజీ టీటీడీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ విశ్వనాథరాజు, సీతారామరాజు, మాజీ ఎమ్మెల్సీ బొమ్మడి నారాయణరావు సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గరికిపాటి మాట్లాడుతూ విద్యారణ్య మహర్షి 14వ శతాబ్దంలో శృంగేరి శారదా పీఠానికి 12వ పీఠాధిపతిగా వ్యవహరించి, సనాతన ధర్మం పరిరక్షణ కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. హరిహర బుక్కరాయులు ద్వారా విజయనగర సామ్రాజ్యం స్థాపనకు విద్యారణ్య మహర్షి మూలకారకులని, ఆయన పేరునే విద్యానగరంగా ఏర్పడి తరువాత కాలంలో విజయనగర సామ్రాజ్యంగా రూపాంతరం చెందిందని అన్నారు. సభలో సంగీత విద్వాంసులు ప్రభావతి పైడిరాజు, కంతేటి వెంకట రాజు, చంద్రాజీ, పైడిరాజు, కనకరాజు వబిలిశెట్టి, హిందూ ధర్మపరిషత్ సభ్యులు రాంకుమార్ రాజు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న గరికిపాటి నరసింహారావు

ఎలుకల బెడదతో రైతుల బెంబేలు

- పంటను నాశనం చేస్తున్న మూషికాలు
- సామూహికంగా నిర్మూలన చేపట్టాలని అధికారుల సూచన

యలమంచిలి: వరి, ఉద్యానవన పంటలకు ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు ఎక్కువగా నాశనం చేస్తుంటాయి. దాళ్వా సీజన్‌లో ఆకుమడుల దశ నుంచి కుప్పల వరకూ ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. దీంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. పంట వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎలుకల బెడద ఉంటుంది. ఎలుకలను సమర్థంగా అరికట్టాలంటే రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టడం వల్లే సాధ్యమని గుర్తించిన వ్యవసాయాధికారులు ఏడాదికి రెండుసార్లు ప్రతి పంటకు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నారు. వరితో పాటు ఉద్యానవన పంటలైన కొబ్బరి, అరటి, కాయకూరల తోటలకు కూడా ఎలుకల బెడద ఉంది. ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసి పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వలన కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు.

గుర్తించే విధానం..

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

ముందుగా రైతులు తమ పొలం గట్లపై కులపు మొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా బ్రొమోడయోలోన్ అనే ఎరను ప్రభుత్వం రైతులకు ఉచితంగా సరఫరా చేస్తుంది. రైతులు ఆ ఎరను తెచ్చుకుని ఎలుకలను నివారించుకోవచ్చు. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రొమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేయవచ్చు. ఆ ఎర 50 ఎలుక బొరియలకు సరిపోతుంది. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన బొరియలను చూస్తే తెరుచుకున్న బొరియలు కనిపిస్తాయి. ఆ బొరియల వద్ద 10 గ్రాముల బ్రొమోడయోలిన్‌ఎర పొట్లాలను ఉంచాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. ఇక రెండవ విధానంలో వేటగాళ్ల చేత ఎలుక బుట్టలు వేయించి ఎలుకలను అరికట్టవచ్చును. అయితే ఈ విధానంలో వేటగాళ్లు ఒక్కో ఎలుకకు రూ.60 వరకూ తీసుకుంటారు. మరొక విధానంలో ఎలుక బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.100 తీసుకుంటారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులంతా బ్రొమోడయోలిన్ ఎర ద్వారానే ఎలుకల నివారణ చేయడం సులభంగా జరిగే పని అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఏ విధానంలో చేసినా రైతులంతా సామూహికంగా ఈ పని చేస్తేనే ఎలుకలను సమర్థంగా అరికట్టగలమని వారు చెబుతున్నారు.



వరి పంటను కొరుకుతున్న ఎలుక



ఎలుకలను పట్టడానికి బుట్టలు సిద్ధం చేస్తున్న వేటగాడు

సామూహికంగానే సమర్థంగా అరికట్టగలం



వరి పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఎలుకలను నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రొమోడయోలిన్ మందును పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టగలం. దీనిపై రైతులకు ప్రతి ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రొమోడయోలిన్ మందును ప్రతి రైతుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా అందజేస్తున్నాం. ప్రస్తుతం ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతుంది.

– సింగులూరి దేవి, మండల వ్యవసాయాధికారి, యలమంచిలి

హిమోగ్లోబిన్ పరీక్షలపై అవగాహన

పాలకొల్లు అర్బన్: హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించడం వల్ల శరీరంలో రక్తశాతం వివరాలు సులువుగా తెలుసుకోవచ్చని మాస్టర్ ట్రైనర్ రేలంగి వెంకట్ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యలమంచిలి, దొడ్డిపట్ల, మేడపాడు, లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణపై శనివారం అవగాహన కల్పించారు. శరీరంలో 11 శాతం ఉంటే రక్తహీనత లేనట్లుగా భావించాలన్నారు. అలాగే 10 నుంచి 10.9 ఉంటే తేలికపాటి రక్తహీనత సమస్య ఉన్నట్లుగాను, అలాగే 7 శాతం ఉంటే తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించాలన్నారు. వీరు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్ల ద్వారా ఐరన్ మాత్రలు అందించి రక్తశాతం పెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైనర్లు డి.పవన్‌కుమార్, రేలంగి సుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.



హిమోగ్లోబిన్ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సైన్స్ ఫెయిర్ నిర్వహణ అభినందనీయం

పాలకొల్లు అర్బన్: ఇటీవల ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్‌లో మెగా సైన్స్‌ఫెయిర్ నిర్వహణ అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు అన్నారు. సైన్స్ ఫెయిర్ నిర్వహించి నాలుగు రికార్డులను సొంతం చేసుకున్న సందర్భంగా రోటరీ పూర్వ అధ్యక్షులు మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసులను రోటరీ క్లబ్ సభ్యులు శనివారం సత్కరించారు. రోటరీ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి రావాడ సతీష్, అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మిడి రాజేష్, క్లబ్ మాజీ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, షేక్ పీర్ సాహెబ్, మైగాపుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మద్దాల సోదరులను సత్కరిస్తున్న దృశ్యం

పితాని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

పెనుగొండ: మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఇతరులపై బురద జల్లేటప్పుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ హితవు పలికారు. శనివారం ఆచంటలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాదయాత్ర పేరుతో తిరుగుతూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుపై లేనిపోని ఆరోపణలు చేయడం పితాని అవివేకానికి నిదర్శనమన్నారు. ఆటో ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు చనిపోతే తక్షణమే మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు స్పందించి పాలకొల్లు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించి, మృతదేహాలు పాడవకుండా రెండు ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేశారన్నారు. పాలకొల్లు ఆసుపత్రిలోని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పరామర్శ ఫొటోలను చూపుతూ పచ్చబ్యాచ్ చెప్పిన మాటలు నమ్మి శ్రీరంగనాథరాజుపై ఆరోపణలు చేయడం మానుకోవాలని ఖండించారు. నిత్యం కుల రాజకీయాలు తప్ప మరో పని లేదా? అంటూ ప్రశ్నించారు. గతంలో చేసిన అవినీతిపై ప్రశ్నిస్తుంటే, శ్రీరంగనాథరాజుపై అవినీతి పరుడని ముద్రవేయడానికి యత్నిస్తూ అబాసుపాలవుతున్నారన్నారు. ఈఎస్ఐ స్కాం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. స్కాంకు పాల్పడకపోతే మీ తనయుడు ఇతర రాష్ట్రానికి ఎందుకు పారిపోయారో? సమాదానం చెప్పాలన్నారు. పితాని పదిహేను సంవత్సరాల్లో చేయని అభివృద్ధిని ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు నియోజకవర్గంలో చేశారన్నారు. ప్రజలు తేడాను గమనిస్తున్నారన్నారు. కమీషన్ల పేరుతో నానా ఇబ్బందులు పెట్టి ఇపుడు అవినీతిపై మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో పితాని ఓటమి ఖాయమని, శ్రీరంగనాథరాజు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోట సరోజని వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, వేమవరం ఉప సర్పంచ్ కొండేటి సురేష్, పెచ్చెట్టి సత్యనారాయణ మన్నే సుబ్బారావు, కుక్కల కిరణ్, వేమన అప్పారావు, కే రాజారావు, పెచ్చెట్టి రామారావు, పుచ్చకాయల నాగార్జున పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో పలు అంశాలపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, అంగన్‌వాడీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఝాన్సీ లక్ష్మీ, డి.కల్యాణి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లకు శంకుస్థాపన

పెనుగొండ: రామన్నపాలెంలో పలు కమ్యూనిటీ భవన నిర్మాణాలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్, కామధేను లంకలో బీసీ కమ్యూనిటీ హాల్ పెద పాలెంలో రజక కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి బుజ్జి, పార్టీ నాయకులు పలివెల శ్రీను, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలో పేడుతున్నారనే సమాచారంతో వారిపై దాడి చేసి శుక్రవారం రాత్రి నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.41,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.